క్లుప్తంగా

సీఎం రేవంత్‌ను కలిసిన 'ఎర్నేని'



సీఎంతో చిన జీయర్‌స్వామి, ఎర్నేని రామారావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం చినజీయర్ స్వామితో కలిసి జీయర్ సంస్థల బాధ్యుడు ఎర్నేని రామారావు కలిశారు. ఈ సందర్భంగా శంషాబాద్ మండలం ముచ్చింతలలో నేడు(బుధవారం) నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే భగవద్ రామానుజుల వారి సమతా కుంభ్–2024 మహోత్సవానికి రావాల్సిందిగా సీఎంను ఆహ్వానించారు. దీంతో సీఎం రేవంత్ తప్పకుండా వచ్చి రామానుజుల వారిని దర్శించుకుంటానని చెప్పినట్లు రామారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి పండితాపురంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తాళ్లగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోవింద్రాల గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు బానోత్ పాపాలాల్ కాలుకి తీవ్ర గాయం కాగా.. స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రెండు లారీలు ఢీ..

ఒకరికి గాయాలు

కూసుమంచి: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం సమీపాన సోమవారం తెల్లవారుజామున వెనుక నుంచి వస్తున్న లారీ దాని ముందున్న లారీని ఢీకొట్టగా.. వెనుక లారీలోని డ్రైవర్ ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దివ్య ఖురాన్ మార్గదర్శకం



మాట్లాడుతున్న ముఫ్తీ ఆజామ్

ఖమ్మం మామిళ్లగూడెం: మంచి, చెడులకు దివ్యఖురాన్ మార్గదర్శకమని హదీస్ ప్రొఫెసర్ డాక్టర్ ముఫ్తీ ఆజామ్ సహాబ్ నద్వి అన్నారు. ఖమ్మం సెయింట్ మేరీస్ పాఠశాలలో మదర్సా రుబయ్య లిల్ బనాత్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఇమామె ఖతిబ్ మజ్జిదే అస్తబల్ ముఫ్తీ అబ్దుల్ బాలిక్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన రెండో వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈక్రమంలో ఇస్లాంలో స్త్రీ విద్యపై గల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఫీ ఇజ్రాయిల్, మౌలానా అబ్దుల్ ఘని, మౌలానా బదియుజమ, హఫీజ్ జకీవుల్లా, ముఫ్తీ అబ్దుల్ కలాం, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరుపేరు భైరవకోన
వినోద	మేడామే వెట్ ఇంగ్లీష్, అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్
సాయిరాం	రాజధాని ఫైల్స్
ఆదిత్య	ఓయ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	40		20
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	56	చుక్కకూర	3
బీర	44		20
దొండ	40	తోటకూర	2
పొట్లకాయ	48		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	60		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	36		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	28	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

గతుకుల ప్రయాణం..!

నరకాన్ని తలపిస్తున్న గుదిమళ్ల రోడ్డు
- ఇచ్చిన హామీలను విస్మరించిన గత పాలకులు
- ఖమ్మానికి కూతవేటు దూరంలోనే రోడ్డు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని పాలకులు
- బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



కంకర తేలిన గుదిమళ్ల రోడ్డు

ఖమ్మంరూరల్: ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అంటూ గత పాలకులు ఊదరగొట్టు ప్రసంగాలు చేయడం అనంతరం ఆ హామీని విస్మరించడం సర్వసాధారణమేనని గుదిమళ్ల వాసులు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుదిమళ్ల గ్రామం ప్రకాశ్‌నగర్ నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. కానీ ఈ రోడ్డుపై ప్రయాణిస్తే.. మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిందేనని గ్రామస్తులు వాపోతున్నారు. అంటే రోడ్డు దుస్థితి అంత దారుణంగా ఉందనేది చెప్పకనే చెప్పొచ్చు. గ్రామం నుంచి ఏ అవసరం కావాలన్నా ఖమ్మం రావాల్సిందే. అయితే రోడ్డు మొత్తం కంకర తేలి పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తుండడంతో వాహనం కదలలేక కుదుపులకు గురై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మోక్షం కలిగేదెన్నడో?

గతంలో కొన్నేళ్లు ఈ గ్రామాన్ని ఖమ్మం నగరంలో విలీనం చేశారు. అనంతరం తిరిగి గ్రామ పంచాయతీగా ఏర్పడింది కానీ పంచాయతీ పాలక వర్గం ఎన్నిక జరగలేదు. దీంతో ఈ రోడ్డు దుస్థితిని అటు ఖమ్మం నగరపాలక సంస్థ కానీ, గతంలో ఉన్న పంచాయతీ పాలకులు కానీ పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామస్తులు, ప్రయాణీలకు ఇబ్బందులను గుర్తించి బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై వెళ్లలేక..

రైతులు తమ వ్యవసాయ పొలాలకు ఎరువులు, పంట ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ కంకరతేలిన రోడ్డుపై వెళ్లలేక వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇక వర్షాకాలమైతే నడవటమే కష్టతరంగా ఉంటుంది. ఈ గ్రామానికి వయా వెంకటగిరి నుంచి కూడా వెళ్లొచ్చు. కానీ ఈ మార్గంలో వెళ్తే పది కిలోమీటర్లు వెళ్లాల్సి ఉండగా.. ఏడు కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి ఖమ్మం వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనం ఖర్చు, సమయం వృథా తప్ప మరేమీ ఉండదు. గత పాలకులు ఎన్నికల సమయాన రోడ్డు నిర్మిస్తామని చెప్పి పట్టించుకున్న పాపానా పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు వేయాలి..



పొద్దున లేచింది మొదలు రాత్రి వరకు ఈ రోడ్డుపైనే వెళ్లాలి. వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించడం, ఖమ్మం వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. గత 20 ఏళ్ల క్రితం కంకర రోడ్డు వేసి వదిలేశారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోలేదు. తక్షణమే బీటీ రోడ్డు నిర్మించాలి.

– పటేల్ వెంకటేశ్వర్లు, గుదిమళ్ల

నడవాలంటే నరకమే..



బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయాన నాయకులు వచ్చి రోడ్డు వేస్తామని హామీ ఇస్తారు ఆ తర్వాత పటించుకోకపోవడంతో రోడు పరిస్థితి యథావిధిగా ఉంటుంది. రైతులు, వాహనదారులు ఈరోడ్డుపై నడవాలంటే నరకమే.

– రానేరు ఖైదు, గుదిమళ్ల

కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలి..



గుదిమళ్ల నుంచి ఖమ్మం వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలతో అధ్వాన్నంగా ఉంది. ఈ రోడ్డును బీటీగా మార్చాల ని గతంలో పలుమార్లు ఎంతోమంది ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం దృష్టి సారించి బీటీ రోడ్డు వేయాలి.

– చల్లా హనుమంతు, గుదిమళ్ల

వైభవంగా ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీఓస్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ పంచమ వార్షిక మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత విశ్వక్సేన ఆరాధన కార్యక్రమాలతో ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటు జగనున్నాయి. రాత్రి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్‌బాబు, ఏపూరి మధుసూధన్‌రావు, వెంకటేశ్వరరావు, భవనాశి కేశవరావు, స్థానికులు భాస్కర్ రావు, రామారావు, పాపారావు, సాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ..

◆ రూరల్ ఏసీపీగా తిరుపతిరెడ్డి..



బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరెడ్డి

ఖమ్మంరూరల్: రూరల్ ఏసీపీగా బి.తిరుపతిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏసీపీగా పని చేస్తున్న తిరుపతిరెడ్డి బదిలీపై ఇక్కడకు రాగా.. గతంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు పర్యాయాలు ఎస్ఐగా, ఒక దఫా సీఐగా పని చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రూరల్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే ప్రజలు కూడా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమాజ రక్షణకు పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

◆ పీఏసీఎస్ చైర్మన్‌గా రోశయ్య..

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ తాత్కాలిక చైర్మన్‌గా కాట్రాల రోశయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను పలువురు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గాదె నాగయ్య, డైరెక్టర్ దేవండ్ల యాదగిరి, కాట్రాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

◆ ఖమ్మం ఎంవీఐగా వెంకటరమణ..



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటరమణ

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎంవీఐగా వెంకటరమణ సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అశ్వారావుపేట చెక్‌పోస్ట్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఖమ్మం రాగా.. ఖమ్మం ఎంవీఐగా పనిచేస్తున్న వరప్రసాద్ వైరాకు బదిలీ అయ్యారు. వెంకటరమణ 2012 ఎంవీఐ బ్యాచ్‌కు చెందినవారు కాగా వరంగల్, ఇతర ప్రాంతాలలో పనిచేశారు. ఆయన జిల్లా రవాణా శాఖాధికారి సిద్దికీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్, ప్రింటర్ అందిస్తున్న ఎస్సై

కామేపల్లి: పొన్నేకల్ ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి కొయ్యడ ముకుంద్, కోదాటి వెంకట్ సుమారు రూ.35 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను సోమవారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరమ్మకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని, పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈనేపథ్యాన పదో తరగతిలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రోత్సాహం కింద గ్రామానికి చెందిన కోదాటి శ్రీనివాస్ రూ.10 వేలు, గింజల నరసింహారెడ్డి రూ.5 వేలు, వడియాల కృష్ణారెడ్డి రూ.5 వేలు చొప్పున ప్రకటించారు.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆర్.నరసింహారావు కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి తన వంతు సాయంగా 50 కేజీల బియ్యాన్ని అందించారు. గ్రామంలో సమాజ సేవ చేస్తూ మరణించిన వారి కుటుంబానికి బియ్యం అందిస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కాలింగి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేత



పరీక్ష ప్యాడు, పెన్నులు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ గాంధీనగర్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం రూ.6 వేల విలువైన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్నాక్స్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి కల్వకుంట్ల గోపాల్‌రావు కుమారుడు ప్రకాశ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అందించిన ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.కృష్ణారెడ్డి, వి.హనుమంతరావు, మేకా దుర్గా నాగేశ్వరరావు, అహోపా కృష్ణమూర్తి, మాటేటి రవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: దేశంలో మతతత్వ పార్టీ అధికారంలో ఉండి దేశ వనరులను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్న తరుణంలో దేశ ప్రజల గొంతుకగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆల్ ఇండియా లెవెల్‌లోనే బలమైన విప్లవ పార్టీగా అవతరించబోతుందని పార్టీ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పిండిప్రోలులో ప్రజాపంథా పార్టీ మండల నాయకురాలు గోకినపల్లి సరోజిని అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నగరంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా, ఆల్ ఇండియా ఐక్యత మహాసభలు నిర్వహించనున్న నేపథ్యాన వచ్చే నెల 3వ తేదీన ఎస్ఆర్అండ్‌బీజీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు వేలాది మందితో మహా ప్రజా ప్రదర్శన బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. అనంతరం పార్టీల విలీన సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటస్వామి, ఎడ్లపల్లి నవీన్, బానోత్ శంకర్, కొత్తపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి



ఫిర్యాదును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్త ఇంటి నంబర్లు, పంపు కనెక్షన్లు తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందజేయగా వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు.

సొసైటీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

- ఈ నెల 22వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ
- 28న ఉపసంహరణ
- మార్చి 1న పోలింగ్ నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల అధికారి రవికుమార్



బైరవునిపల్లిలో సభ్యులతో ఎన్నికల అధికారి రవికుమార్

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి శ్రీమురళీకృష్ణ గౌరెల పెంపకందారుల పారిశ్రామిక సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్.రవికుమార్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. సొసైటీలో మొత్తం ఏడు డైరెక్టర్ పోస్టులు ఉండగా.. అందులో రెండు స్థానాలు మహిళలు, ఐదు జనరల్ స్థానాలు కేటాయించారు.

షెడ్యూల్ ఇలా..

పోటీ చేసే సభ్యులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నామినేషన్లు వేయాలని సూచించారు. 25న స్క్రూటినీ, 26న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు గుర్తుల కేటాయించనుండగా.. మార్చి 1వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, బీసీలకు రూ.750, జనరల్‌కు రూ.1,000 చెల్లించాలని ఎన్నికల అధికారి ప్రకటించారు. సొసైటీలో మొత్తం 173 మంది సభ్యులు ఉండగా.. గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లేబోయిన శ్రీనివాసరావు, కనకబండి రమేశ్, కనకరాజు, బొల్లం సత్యనారాయణ, మల్లేబోయిన ఉపేందర్, బాలిన కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై మక్కువ చూపాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

కామేపల్లి: యువత క్రీడలపై మక్కువ చూపాలని కామేపల్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం కామేపల్లి, కారేపల్లి మండలాల బోడేపూడి ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ట్రస్ట్ నిర్వాహకుడు రాజా ముందుకురావడం అభినందనీయమన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గింజల నరసింహారెడ్డి, ఏపూరి మహేందర్‌కుమార్, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మరిచిపోయిన సెల్‌ఫోన్ అప్పగింత

ఖమ్మంఅర్బన్: ఆటోలో మరిచిపోయిన విద్యార్థిని సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించిన సంఘటన నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని మమత కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థిని సాయిప్రియ సోమవారం ఆటోలో కాలేజ్‌కు వెళ్లింది. హడావిడిలో తన సెల్‌ను మరిచిపోయి వెళ్లగా.. తర్వాత చూసేసరికి ఫోన్ కనబడకపోవడంతో ఖమ్మంర అర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ అంజలి ఆదేశాల మేరకు అర్బన్ పోలీసులు కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాలో వారు ప్రయాణించిన ఆటోను గుర్తించి బాలపేటతండాకు చెందిన ఆటోడ్రైవర్ గోపినాయక్‌ను సంప్రదించారు. అతడు ఆటోను తనిఖీ చేయగా ఫోన్ దొరికింది. ఈనేపథ్యాన విద్యార్థినికి మొబైల్ అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీసీ టీవీ టెక్నీషియన్ ప్రకాశ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షకుడు శివాజీ

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సెంటర్లలో ప్రదర్శనలు నిర్వహించి భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు, హిందూ ధర్మ పరిరక్షుడు శివాజీ అని పలువురు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: త్రీటౌన్‌లో నివాళులర్పిస్తున్న బీసీ జేఏసీ నేతలు



నేలకొండపల్లి: శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఖమ్మంగాంధీచౌక్: వేడుకల్లో పాల్గొన్న ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అటెన్షన్ ప్లీజ్

ఈ మురుగుకు దారెటు..?



నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లి శ్రీలక్ష్మీనగర్ రోడ్డులో ఇళ్లల్లో వాడుకున్న మురుగు నీరు పారేందుకు సరైన మార్గం లేదు. దీంతో నిత్యం ఆ మురుగు నీరంతా ఇదిగో ఇలా రోడ్డుపై పారుతూ.. వచ్చి పోయే పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. అంతేకాక వాహనాలు వెళ్లిన సమయాన రోడ్డు గుంత మరింత పెద్దదై అధ్వానంగా మారుతోంది. ఇలా ప్రధాన రోడ్డులో నాలుగైదు చోట్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మురుగు పారేందుకు దారి చూపించి రోడ్డు దెబ్బతినకుండా చూడాలని నివాసులు కోరుతున్నారు.

- ఖమ్మంఅర్బన్